క్లుప్తంగా

కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలను డివిజన్‌లో ఘనంగా నిర్వహించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నాయకులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పుట్టినరోజు వేడుకలను ఎలా నిర్వహిచాలనే దానిపై చర్చించారు. ఈనెల 17వ తేదీన కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనేలా చూడాలని చెప్పారు. అదే విధంగా ఈనెల 19వ తేదీన కూకట్‌పల్లి ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఎలాంటి లోటు లేకుండా చేయాలన్నారు. ఈ సమావేశంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు మక్కాల నర్సింగ్‌రావు, కర్రె లావణ్య, నాయకులు కర్రె జంగయ్య పిట్ల రాజు, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి మేకల హరినాథ్, ఇర్ఫాన్, జహంగీర్, ఖాదీర్, బాల్‌రాజు, లలితా, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్లను నిర్మించారు. అదే విధంగా ఎల్లమ్మ ఆలయం వద్ద 96 లక్షల వ్యయంతో వరదనీటి కాలువపై నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు వంతెన నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టిన నిర్మాణ పనులకు క్యూరింగ్ మంచిగా చేయాలని అధికారులకు సూచించారు. కల్వర్టు బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేష్ చంద్ర, శివరాజ్ గౌడ్, మోజెస్, పోశెట్టిగౌడ్, సంతోష్, ఉమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు



బీఆర్‌ఎస్ కార్యకర్త కనకరావు భార్యకు బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌కి చెందిన నేతల కనకారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న అతడు పార్టీ నుంచి లభించిన రూ.2లక్షల బీమా చెక్కును భార్య ఝాన్సీకి శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

ఇరుముడి కట్టిన శివస్వాములు



మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో శనివారం 16 మంది శివస్వాములు ఇరుముడి కట్టుకుని శ్రీశైలంకు బయలుదేరారు. ఆలయ అర్చకులు కృష్ణ సూరి వారికి శనివారం ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు శివమాల ధరించి పూజలు నిర్వహించి శ్రీశైలం బయలుదేరి వెళుతున్నామని శివమాలదారులు నరసింహ అన్నారు.

ప్రమాదకరంగా గేట్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని పార్కును లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. భారీ గేట్ కూడా ఏర్పాటు చేశారు. కానీ గేట్‌ను మాత్రం పిల్లర్‌కు ప్లేట్‌తో బిగించారు. దీంతో ఓపెన్ చేసే సమంయలో, మూసివేసే సమయంలో గేటు పడిపోయే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎక్కువ రోజులు గేటు నిలబడదని అంటున్నారు. పిల్లర్ వేసే సమయంలోనే స్టీల్‌కు గేట్ బిగించి కాంక్రీట్ వేయాలి.



కీసరగుట్ట అభివృద్ధిపై

శీత కన్ను!

ఐదేళ్ల కిందట రూ.75.65 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు

తెలంగాణలో రెండో వేములవాడ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న సుప్రసిద్ధ కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం శీత కన్ను ప్రదర్శిస్తోంది. ఐదేళ్ల కిందట ఆలయ అభివృద్ధికి రూ.75.65 కోట్లతో ప్రభుత్వానికి నివేదించిన ప్రతిపాదనలకు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరిగే కీసరగుట్ట బ్రహ్మోత్సవాల వరకైనా మోక్షం లభించగలదన్న ఆశాభావాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలు, ముఖ్యంగా భక్తులు వ్యక్తం చేస్తున్నారు. కీసర గుట్టకు ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

– సాక్షి,మేడ్చల్ జిల్లా

- నేటికీ పట్టించుకోని ప్రభుత్వం
- ఈ సారి ఉత్సవాల వరకు నిధుల మంజూరుపై భక్తుల్లో ఆశలు
- ప్రతీ ఏటా భక్తుల నుంచి వస్తున్న ఆదాయం రూ.3 కోట్లు
- నిధులు మంజూరుపై మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని జిల్లా ప్రజల వినతి



కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం



ఆలయంలో కొలువుదీరిన శ్రీరామలింగేశ్వర స్వామి

ప్రతీ ఏటా పెరుగుతున్న భక్త జనం..

హైదరాబాద్‌కు సమీపంలో ఎత్తయినా సువిశాలమైన ప్రదేశంలో వెలిసిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి శైవక్షేత్రానికి ప్రతీ ఏటా భక్త జనం తాకిడి బాగా పెరుగుతూ వస్తోంది. గతేడాది 3 లక్షల మంది భక్తులు రాగా, ఈ ఏడాది 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం ఆ మేరకు అన్ని సదుపాయాలతో ఏర్పాట్లు చేస్తోంది. మేడ్చల్ జిల్లా నుంచే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సిద్దిపేట, యాదాద్రి, నల్లగొండ, వరంగల్ ఇతర జిల్లాల నుంచి ఈ శైవక్షేత్రానికి ప్రతీ ఏటా మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి ఉత్సవాలను లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

ఏటా భక్తుల నుంచి వచ్చే ఆదాయం రూ.3 కోట్లు...

కీసరగుట్ట శైవక్షేత్రానికి ప్రతీ ఏటా మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి ఉత్సవాలతో సాధారణంగా తరలి వచ్చే లక్షలాది మంది భక్తుల ద్వారా ఆలయానికి దాదాపు రూ.3 కోట్ల ఆదాయం వస్తోందని దేవాదాయ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. శివరాత్రి సందర్భంగా ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు దేవాదాయ శాఖ తెలిపింది. గతేడాది కీసర గుట్ట దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలకు రూ.70 లక్షలు వెచ్చించినట్లు ఆ శాఖ పేర్కొంది.

ఆలయాభివృద్ధికి ఐదేళ్ల కిందటే ప్రతిపాదనలు...

కీసరగుట్ట ఆలయాభివృద్ధికి 2017 డిసెంబర్‌లో రూ.75.65 కోట్లతో జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. హైదరాబాద్ మహా నగరానికి కీసరగుట్ట కూత వేటు దూరంలో ఉండటంతో నగరం నుంచి ప్రతిరోజు వేలాదిగా భక్తులు తరలి రావడంతో.. అందుకు తగ్గట్టుగా భక్తులకు వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం అధికార యంత్రాంగానికి ఉంది. అప్పట్లో ఆలయాన్ని సందర్శించిన సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యదర్శి భూపతిరెడ్డికి అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి సంబంధిత ప్రతిపాదనలను అందజేయడంతో పాటు సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నిర్వహణకు సర్కారు నిధులు..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కీసరగుట్టలో 2020లో రూ.25 లక్షలు, 2021లో రూ.50 లక్షలు, 2022లో రూ.50లక్షల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఉత్సవాలకు ప్రభుత్వం తాత్కాలికంగా విడుదల చేస్తున్న నిధులతో సహా ఆలయ కమిటీ ప్రత్యేకంగా వెచ్చిస్తున్న ఖర్చులు, భక్తులకు కల్పించే వసతులు, ఆదాయ, వ్యయాలకు సంబంధించి పలు అనుమానాలకు తావిస్తోంది.

అభివృద్ధి ప్రతిపాదనలివే...

- రామలింగేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి ప్రతిపాదించిన రూ.75.65 కోట్లతో ఈ కింది పనులు చేపడితే.. రెండో వేములవాడ శైవక్షేత్రంగా అభివృద్ధి చెందగలదని భక్తులు అభిప్రాయపడుతున్నారు.
- ఆలయానికి ప్రస్తుతం రెండు వైపుల మాత్రమే రాజ గోపురాలు ఉన్నాయి. మిగతా రెండు వైపుల కూడా రాజ గోపురాల నిర్మాణం చేపట్టాలి.
- కీసర గుట్ట ఎక్స్ రోడ్డు నుంచి ఆలయం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి
- ఆంజనేయ స్వామి ఆలయం నుంచి నూర్ మహ్మద్ చెరువు వరకు రోప్ వే నిర్మించాల్సి ఉంది.
- కోనేరు నిర్మాణం, ధర్మశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, బైపాస్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి.
- 100 ఎకరాల అటవీ భూమిలో అర్బన్ పార్కు ఏర్పాటు చేసి భక్తులకు ఆహ్లాదంగా ఉండేట్లు మంచి వాతావరణం కోసం వసతులు కల్పించాల్సి ఉంది.
- మిషన్ భగీరథ కింద దైవ క్షేత్రానికి వచ్చే భక్తులకు సరిపడా నీటి వసతి కల్పించాలి.
- కీసర, చీర్యాల, దొంగల మైసమ్మ చౌరస్తాల వద్ద ముఖ ద్వారాలు, ప్రాకార మండపాలు నిర్మించాలి.
- అన్నదాన ప్రసాదం, లడ్డూ ఇతర ప్రసాద కౌంటర్ల నిర్మాణం, పరిపాలనా భవనం, సమావేశ మందిరం, చైర్మన్ ట్రస్టీ కార్యాలయం నిర్మించాలి.
- గుట్టపై గల లక్ష్మీనర్సింహా స్వామి, ఆంజనేయ స్వామి, మారుతీ కాశీవిశ్వేర ఆలయం, నాగదేవత ఆలయాలను అభివృద్ధి చేయాలి.
- నూర్‌మహ్మద్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలి.
- స్పోర్ట్స్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ నిర్మాణం, ఓపెన్ థియేటర్, పారిశుధ్య కార్మికులకు షెడ్, భోజనశాల, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, క్యూలైన్ల షెడ్ నిర్మాణం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, దేవాయ అతిథి గృహాలు, వీఐపీలు, వీవీఐపీల గదుల నిర్మాణం, జేడీ్స అతిథి గృహం అభివృద్ధి, సౌండ్ సిస్టమ్, విద్యుత్ స్తంభాలు, రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు, ఆర్కియలాజీ మ్యూజియం అభివృద్ధి తదితర సుందరీకరణ పనులు చేపట్టాలి.



ఐఈఈఈ అండ్ సి–డాక్ కోర్సుల నిర్వహణపై ఒప్పందం

ఎంఓయూపై సంతకం చేసిన జేఎన్‌టీయూ, సిద్ధేష్ ఎడ్యుటెక్



జేఎన్‌టీయూ హెచ్‌లో ఒప్పందంపై సంతకాలు చేసిన సంస్థ ప్రతినిధులు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ, సిద్ధేష్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఐఈఈఈ అండ్ సి–డాక్ కోర్సుల నిర్వహణపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు.

- జేఎన్‌టీయూహెచ్ అన్ని కళాశాలలు, అనుబంధ కళాశాలల గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు 13వేల మందికి ఉచితంగా లాట్ టెక్నాలజీస్‌పై అప్ స్కిల్లింగ్ ప్రోగ్రాం అందివ్వనున్నారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ మద్దతు తెలిపిందని వైస్‌చాన్సలర్ తెలిపారు.
- ఈ కార్యక్రమంలో సి–డాక్, నీలిట్ అండ్ ఐఈఈఈ ద్వారా జాయింట్ సర్టిఫికేషన్ ఉంటుందని తెలిపారు. జేఎన్‌టీయూహెచ్‌లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎల్‌ఓటీ టెక్నాలజీస్‌లో వారి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడానికి ఈ కార్యక్రమం సహాయం చేస్తుందన్నారు. తద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.
- గ్రామీణ కళాశాలల మేనేజ్‌మెంట్‌లు, ప్రిన్సిపాల్స్ ఈ యాప్ స్కిల్లింగ్ ప్రోగామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి రుసుం లేనందున ఈ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సాహించాలని అధ్యాపకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. ఎ.గోవర్ధన్, మంజూర్ హుస్సేన్, ఎం.చంద్రమోహన్, పి.శ్వేత, డా.గౌతమ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేవైటీం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పటేల్ కుంట పార్కు వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం



వాకర్స్‌తో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పటేల్ కుంట పార్కు వాకర్స్‌కు ఆర్‌కేవైటీం ఆధ్వర్యంలో ఉద్భవ చిల్డ్రన్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట నాయకులు రవికుమార్‌యాదవ్ ప్రతి ఒక్క వాకర్‌ని కలిసి పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ఒత్తిడి నుంచి మనం జాగ్రత్తగా ఉండాలంటే బీపీ, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ మౌలిక సదుపయాలు సరిగా లేవని, టాయిలెట్స్ కూడా శుభ్రంగా లేవని వాకర్స్ తెలిపారు. ఓపెన్ జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సత్యనారాయణ, నర్సింగ్‌యాదవ్, చారి, నర్సింగ్‌రావు, భాస్కర్‌రెడ్డి, అంజయ్య, గోపాల్ రావు, వెంకటస్వామి, ఎత్తరి రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



సంధ్యారాణి (ఫైల్)

బాలానగర్: కాలేజీలో జరుగుతున్న ఫంక్షన్‌కు వెళ్లిన ఓ విద్యార్థిని తిరిగి ఇంటికి రాలేదు. ఈ సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాంబశివరావు తన కుటుంబసభ్యులతో కలిసి ఇంద్రానగర్‌లో నివాసం ఉంటున్నాడు. సాంబశివరావు కూతురు సంధ్యారాణి (21) డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. కాలేజీలో నిర్వహించే ఫంక్షన్‌కు ఈనెల 10వ తేదీన ఉదయం 10గంటలకు ఇంట్లో వాళ్లకి చెప్పి బయలుదేరింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ–వేస్ట్ ర్యాలీ



హైదర్‌నగర్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మెంబర్లు



ఈ–వేస్ట్ కలెక్షన్స్‌లో పాల్గొన్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరు రఘు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ–వేస్ట్ ర్యాలీలో భాగంగా శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో లయన్స్‌క్లబ్ సభ్యులు, విద్యార్థులతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ వారు నిర్వహించే ఈ–వేస్ట్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రజలు ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను రీసైక్లింగ్ చేసేందుకు పిల్లలు, పెద్దలు అందరూ సహకరించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమం చేపట్టిన లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలోలయన్స్ క్లబ్ సభ్యులు రఘు జూలూరి, హరినారాయణ, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వేణుగోపాల్, దేవేందర్, రవికాంత్, పాఠశాల విద్యార్థులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

భాగ్యనగర్‌కాలనీలో ఈ–వేస్ట్ కలెక్షన్

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శనివారం కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీలో జరిగిన ఈ–వేస్ట్ కలెక్షన్స్ కార్యక్రమంలో శనివారం డిస్ట్రిక్ట్ 320 గవర్నర్ జూలూరు రఘు, రెండో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి. కోటేశ్వరరావు, క్యాబినెట్ సెక్రటరీ నూలి శ్రీనివాస్, క్యాబినెట్ ట్రెజరర్ ఎల్. వేణుగోపాల్, లయన్ దేవేందర్ బండారి, రీజన్ చైర్ పర్సన్స్, జోన్ చైర్ పర్సన్ రోణంకి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి వద్ద అయినా నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఉంటే అందజేయాలన్నారు. రీ సైక్లింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శన

మోతీనగర్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల మేధస్సు మరింత మెరుగు పడుతుందని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో షైనింగ్ సీడ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనశాలను ఆయన ప్రారంభించారు. సుమారు 100 రకాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాజహాన్, దుర్గ నాయకులు వినోద్ కుమార్, నాగుల సత్యం గంగపుత్ర, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సలహాలతో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు, పండుగలపై విద్యార్థులు వివరించిన తీరు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

ఇందిరానగర్ జోలికి వస్తే సహించేది లేదు

టీపీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం



హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ నాయకులు

బాలానగర్: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా ఇందిరానగర్, శ్రీశ్రీనగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ఇంటింటికి తిరుగుతూ రాహుల్‌గాంధీ సందేశాన్ని కరపత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

– మోదీ, కేసీఆర్‌ల మాటలను నమ్మి మరోసారి ప్రజలు మోసపోవద్దన్నారు. పేదల సంక్షేమమని చెప్పుకుంటూ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని అడ్డంగా దోచేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన భూములు, స్థలాలను కేసీఆర్ ప్రభుత్వం లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా వస్తుందని ప్రజలకు స్థలాలను తిరిగి ఇప్పించి వారికి ఇళ్లను నిర్మిస్తోందని తెలిపారు.

- విద్యుత్ చార్జీలు పెంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, మధుగౌడ్, అజీజ్ ఖాన్, బందిగ బాలనర్సింహ, జామీర్ హుస్సేన్, మాదరి శ్రీను, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు సేవ చేయటం భగవత్ సేవతో సమానం



అనాథాశ్రమంలో పిల్లలకు భోజనాలు పెడుతున్న బల్గూరి రంగారావు

కూకట్‌పల్లి: అనాథ పిల్లలకు చేతనైన సేవ చేయడం భగవత్ సేవతో సమానమని కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ సీనియర్ నాయకులు బల్గూరి రంగారావు అన్నారు. ఆయన కుమారుడు బి. అజయ్, ప్రవీణల మొదటి వివాహ మహోత్సవం సందర్భంగా శనివారం ద్వారకమాయి సేవా సమితి ఆశ్రమంలో ఉంటున్న చిన్నారులకు రంగారావు కుటుంబసభ్యులు భోజనం అందించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు, అరటిపళ్లు పంచిపెట్టారు. సుమారు 50 మంది పిల్లలను కంటికి రెప్పలా కాపాడుతూ వారికి వసతి, భోజనం, విద్యనందిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా రంగారావు అబినందించారు.